

డోలిలో తరలించిన మహిళ క్షేమం

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండలం జిన్నలగూడెం గ్రామానికి చెందిన కూరం కోసి అనే గిరిజన మహిళ మగ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని కుక్కునూరు ప్రాథమిక వైద్యులు రమేష్ తెలిపారు. ప్రసవం తేదీకి ముందుగానే నొప్పులు రావడంతో ఆ గిరిజన మహిళను డోలి ద్వారా బర్లమాడుకు తీసుకురావడం జరిగిందని, అక్కడనుంచి వైద్య సిబ్బంది పిహెచ్‌సికి తరలించారని వైద్యులు తెలిపారు.

తల్లి, బిడ్డతో వైద్యులు



పోలీసులకు..
పంగనామం..!

ఏడాదిన్నరగా టిఎ, సరెండర్ లీవుల సొమ్ము పెండింగ్

ఒక్కో పోలీస్ ఉద్యోగికి తక్కువగా లెక్కించినా రూ.లక్షన్నర బకాయి

జిపిఎఫ్, భద్రతా రుణాల మంజూరులోనూ నిరాశే

వీక్లీఆఫ్‌ను కాగితాలకే పరిమితం చేసిన వైసిపి సర్కార్

రెండు జిల్లాల్లోనూ మూడు వేల మంది పోలీస్ సిబ్బంది అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గతంలో ఏ ప్రభుత్వమూ తమను ఇంతగా మోసం చేయలేదంటూ పోలీస్ సిబ్బంది నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులను ప్రయివేటు సైన్యంలా వాడుకుంటున్న వైసిపి సర్కార్ టిఎ, సరెండర్ లీవుల సొమ్ము వంటివి సైతం ఇవ్వకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జిపిఎఫ్, భద్రతా రుణాల మంజూరులోనూ తీవ్ర నిరాశే పోలీసులకు మిగిలింది. వీక్లీఆఫ్ సైతం కాగితాలకే పరిమితమవ్వడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ పోలీసుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఏ పోలీస్ సిబ్బందిని కదిపినా ఇదే చర్చ సాగుతోంది.

పోలీసులను ప్రజలపై ఉసిగొల్పుతూ ఓ ప్రయివేటు సైన్యంలా వాడుకుంటున్న వైసిపి సర్కార్ వారికి ఇవ్వాల్సిన ఆర్థిక విషయాల్లో మాత్రం పంగనామాలు పెట్టిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం తమను తీవ్రంగా వంచించిందనే భావన పోలీసులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కానిస్టేబుల్ నుంచి పైస్థాయి వరకూ మూడు వేల మందికిపైగా పోలీసులు పని చేస్తున్నారు. ఏ పోలీస్‌ను కలిసినా తమ బాధను చెప్పుకునే పరిస్థితి ఉంది. తమకు రావాల్సిన టిఎ, సరెండర్ లీవ్స్ సొమ్ము ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పోలీసులు సిఎం, వివిపి బందోబస్తులతోపాటు, వేరే ప్రాంతాల్లో విధులు నిర్వర్తించినందుకుగాను టిఎ (రవాణా ఖర్చు) నెలకు రూ.2,100 ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సొమ్ము ఏమాత్రం సరిపోదు. రాజధాని ప్రాంతంలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి రోజుకు భోజనంతోపాటు, ఇతర ఖర్చుల రూపంలో తడిసిమోపెడవుతున్నా సర్దుకుపోతున్న పరిస్థితి ఉంది. వైసిపి సర్కార్ వచ్చిన తర్వాత పోలీసులకు ఇవ్వాల్సిన టిఎ బిల్లుల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతుందని చెబుతున్నారు. దాదాపు ఏడాదిన్నరగా పోలీస్ సిబ్బందికి ఇవ్వాల్సిన టిఎ బిల్లుల సొమ్ము పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులకు 24 గంటల విధి నిర్వహణ ఉంటుంది. అందుకుగాను సరెండర్ లీవ్స్ కింద ఏడాదికి ఉద్యోగి అనుభవాన్ని బట్టి రూ.20 వేల నుంచి రూ.40 వేలకుపైగా ఇవ్వాల్సి ఉంది. ఈ సొమ్ము ఏడాదికి మూడు విడతలుగా జనవరి, జులై, నవంబర్‌లో చెల్లిస్తారు. ఈ సొమ్ముతోనే పోలీస్ సిబ్బంది తమ పిల్లల స్కూల్ ఫీజులు విడతలవారీగా చెల్లిస్తూ ఉంటారు. సరెండర్ లీవ్స్‌కు సంబంధించిన బకాయిలు 2022లో ఒక విడత రావాల్సి ఉండగా, 2023కు సంబంధించి మూడు విడతల్లో ఒక్కటీ కూడా ఇవ్వలేదు. మొత్తం నాలుగు విడతలకు సంబంధించిన సరెండర్ లీవ్స్ సొమ్ము బకాయిలు పోలీస్ సిబ్బందికి ఇవ్వాల్సి ఉందని చెబుతున్నారు. ఒక్కో ఉద్యోగికి తక్కువగా లెక్కించినా రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకూ టిఎ, సరెండర్ లీవ్స్, ఇతర బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగం చేసేవారికి ఇది చాలా పెద్దమొత్తంగా చెప్పొచ్చు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్న పోలీసులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుభూతి లేకుండాపోయిందనే చర్చ నడుస్తోంది.

కాగితాల్లోనే వీక్లీ ఆఫ్

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పోలీసులకు వీక్లీ ఆఫ్ (వారాంతపు సెలవు) అమలు చేస్తామని వైసిపి హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడ్డాక వీక్లీఆఫ్ అమలుపై ఆదేశాలు సైతం ఇచ్చి ఇదీ తమ ప్రభుత్వ చిత్తశుద్ధి అంటూ గొప్పలు చెప్పింది. అయితే వీక్లీఆఫ్ అనేది మూన్నాళ్ల ముచ్చటగా మారిపోయింది. రెండు, మూడునెలలు కూడా కొనసాగని పరిస్థితి. వీక్లీఆఫ్ అనేది కాగితాలకే పరిమితం కావడంతో పోలీసులకు సెలవు అనేది లేకుండా పోయింది. ఉద్యోగులకు సంబంధించిన పిల్లల వివాహాలు, ఇతర ఆపదల సమయంలో అండగా నిలిచే జిపిఎఫ్‌కు సంబంధించిన సొమ్ము సైతం దరఖాస్తులు చేసుకున్నా అందని పరిస్థితి. ఇంటి నిర్మాణం వంటి వాటి కోసం ఇచ్చే భద్రతా రుణాల మంజూరులో తీవ్ర నిరాశే పోలీసులకు మిగిలింది. ఇలా అనేక సమస్యలతో పోలీసులు సతమతమవుతున్నారు. దీంతో ప్రభుత్వంపై పోలీస్ కుటుంబాలు తీవ్ర ఆగ్రహంగా ఉన్న పరిస్థితి కన్పిస్తోంది. తమకు సమ్మె చేసే హక్కు లేదని, ఉంటే తాము కూడా రోడ్డెక్కి ఆందోళన చేసేవాళ్లమని పలువురు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. పోలీసుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు జనాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలీక పోలీస్ సిబ్బంది మౌనంగా రోదిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందైనా తమకు ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేయాలని వారంతా కోరుతున్నారు.

పెద్దపులి పాదముద్రలు సేకరణ

సమాచారం టోల్ ఫ్రీ నెం.1800-425-5909కు తెలపండి

అటవీ శాఖ బృందాలు నియామకం

జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రధామా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు సెక్షన్ రామసింగవరం బీట్ పరిధిలో దెందులూరు మండలం పెరుగుగూడెం గ్రామ సమీపంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు గుర్తించామని జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రధామా ఒక ప్రకటన లో తెలిపారు. పెరుగుగూడెం గ్రామ సమీపంలో మొక్కజొన్న తోటలో శరీరంపై బంగారు మచ్చలు కలిగిన జంతువును ఈ నెల 26న కొంతమంది చూసి సమాచారం ఇచ్చారని, ఆ ప్రాంతాన్ని పరిశీలించగా పెద్దపులి పాదముద్రలు గుర్తించామని పేర్కొన్నారు. పెద్దపులి కదలికలను గుర్తించేందుకు అటవీశాఖ సిబ్బందిని బృందాలుగా నియమించామని తెలిపారు. ఆ ప్రాంత ప్రజలు ఒంటరిగా వెళ్లరాదని, గేదెలను, ఆవులను, మేకలను సదరు ప్రదేశానికి తోలుకెళ్లొద్దని సూచించామని పేర్కొన్నారు. పెద్దపులి సంచారంపై సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు.1800-425-5909కు తెలియజేయాలని ఆయన కోరారు. పశువుల పాకలవద్ద రాత్రిపూట ఎక్కువ వెలుతురు వచ్చే విధంగా దీపాలను ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి సమయంలో బయట తిరగరాదని సూచించారు.

యర్రమిల్లిపాడులో పెద్దపులి అంటూ ప్రచారం

కావని తేల్చి చెప్పిన అటవీ అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడులో పోతురాజు అనే రైతు మొక్కజొన్న పొలంలో గుర్తుతెలియని జంతువు పాద ముద్రలు, కొంతవరకు పంట పాడవడం, నీళ్ల పైపు దెబ్బతినడంతో తొలుత పెద్ద పులి సంచరిస్తుందేమో అనే ఆందోళన వ్యక్తం అయ్యింది. దీంతో గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో చేబ్రోలు ఎస్ఐ మణికుమార్ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు, నల్లజర్ల అటవీ శాఖ అధికారులు, సిబ్బంది యర్రమిల్లిపాడు వచ్చి పాద ముద్రలను పరిశీలించారు. అవి పెద్దపులి పాద ముద్రలు కావని, ఇతర జంతువు అయ్యి ఉంటుందని, పులి జనావాసాల్లోకి రాదని, అధైర్యపడొద్దని డిఆర్ఒ ఎస్‌సిఎస్.కుమార్ చెప్పారని సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు వెల్లడించారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మొదటి అదనపు జిల్లా జడ్జి రామగోపాల్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజలు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ అధ్యక్షతన స్థానిక ఎన్ఆర్ పేటలోని నారాయణ మహిళా జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు, భద్రత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగోపాల్ మాట్లాడుతూ దేశంలో ప్రమాదాల్లో మృతుల సంఖ్య ప్రతి సంవత్సరం లక్షల్లో ఉంటుందని, ఇది చాలా ఆందోళనకరమైన విషయమని, కావున పట్టణాల్లోనే కాక జాతీయ రహదారుల్లో కూడా తగిన నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ ప్రమాదాల్లో కుటుంబ యజమాని మరణిస్తే ఆ కుటుంబం మొత్తం మీద ప్రభావం చూపుతోందని, కావున ప్రతి వ్యక్తి విద్యార్థి దశ నుంచి చట్టాలపైన అవగాహన, అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు తీసుకోవాల్సి ఉందన్నారు. నిబంధనలను పాటించకపోవడం వల్ల ఎదుటి వ్యక్తులు కూడా ఇబ్బందులు గురికావాల్సి వస్తుందని, కావున రోడ్లపై నడిచేటప్పుడు, ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ నేరం మోపబడిన ప్రతి వ్యక్తికి న్యాయ సహాయం పొందే అర్హత కలిగి ఉన్నారని, అందుకు చట్టం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా ఈ సౌకర్యం కల్పిస్తుందని, కావున కక్షిదారులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అహిరాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి రామగోపాల్

నేటి నుంచి నారాయణపురంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

హ్యాండ్‌బాల్ ఏలూరు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో ఉంగుటూరు మండలం నారాయణపురంలోని చింతలపాటి బాపిరాజు క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. 16 జిల్లాల నుంచి మూడొందల మంది క్రీడాకారులు అండర్-19 బాలుర విభాగంలో ఈ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.

నగరంలో అభివృద్ధి పనులు ప్రారంభం

రూ.4.58 కోట్లతో చేపట్టిన పనులకు ఎంఎల్ఎ ఆళ్లనాని శంకుస్థాపన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మాజీ డిప్యూటీ సిఎం, ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని శనివారం ప్రారంభించారు. ఏలూరు నగరం అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం 1, 2, 3, 4, 21 డివిజన్ల పరిధిలో గడపగడపకీ మన ప్రభుత్వం నిధులు, మున్సిపల్ నిధులు, ఆర్‌బి నిధులు రూ.4.58 కోట్లతో 55 రోడ్లు, 37 డ్రయినేజీలు, 2 పార్కులు, 3 పైపులైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గత 25 రోజులుగా నగరంలో సుమారుగా రూ.40 కోట్ల నిధులతో 250పైగా రోడ్లు, 230పైగా డ్రయినేజీలు, కల్వర్టులు, సచివాలయ నిర్మాణాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసినట్లు ఎంఎల్ఎ ఆళ్ల నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ఆళ్ల నానితో పాటు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కమిషనర్ సంక్రాంతి కృష్ణ పాల్గొన్నారు.



పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

కొనసాగిన సెర్ప్ ఉద్యోగుల సమ్మె

కలెక్టరేట్ వద్ద ధర్నా శిబిరంలో నినదించిన ఉద్యోగులు

సమ్మె శిబిరంలో నినదిస్తున్న సెర్ఫ్ ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సెర్ఫ్ ఉద్యోగుల జెఎసి చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాలుగో రోజు కొనసాగింది. ఏలూరు కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని జెఎసి జిల్లా ఛైర్మన్ సిహెచ్.సుబ్బారావు సందర్శించి మాట్లాడారు. కేడర్లు, పే స్కేల్‌ను సక్రమంగా నిర్ణయించి ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, ఫైనాన్స్ డిపార్టుమెంట్ ద్వారా ఉద్యోగుల సేవలు క్రమబద్ధీకరించడానికి మంజూరైన పోస్టులపై వెంటనే జిఒ ఇవ్వాలని, ప్రస్తుత సీలింగ్ విధానానికి బదులుగా నూరుశాతం బేసిక్ పేపై ఇపిఎఫ్ కంట్రీబ్యూషన్ అమలు చేయాలని, రిజర్వేషన్ల నియమాన్ని సక్రమంగా వర్తింపజేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని, మృతుల కుటుంబాలకు కారుణ్య నియామక పథకం అమలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి మెంబర్ కన్వీనర్ హేమంత్ కుమార్, కన్వీనర్ బాపూజీ, గోపీ, అనిత, లత, విజయకుమారి పాల్గొన్నారు.

చింతలపూడి ఎస్ఐగా కుటుంబరావు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా కుటుంబరావు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో టి.నర్సాపురం, లక్కవరంలో పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ముసునూరు నుంచి చింతలపూడికు బదిలీ అయినట్లు తెలిపారు.

ముసునూరు ఎస్ఐగా వాసు బాధ్యతలు

ముసునూరు : ముసునూరు మండల ఎస్ఐగా పి.వాసు బాధ్యతలు స్వీకరించారు. శనివారం మండల కేంద్రమైన ముసునూరు పోలీస్ స్టేషన్‌కు ఎన్నికల బదిలీల్లో భాగంగా కాకినాడ ఏరియా ఎస్ఐగా పనిచేస్తున్న పి.వాసు ముసునూరు మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి నుంచి అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టడం జరుగుతుందని, ఎలక్షన్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేపట్టినా.. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పత్రికా ముఖంగా తెలిపారు.

చింతలపూడి సిఐగా సుధాకర్

చింతలపూడి :చింతలపూడి నూతన సిఐగా ఎం.సుధాకర్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన భీమడోలు ఎస్ఐగా, జిల్లా స్పెషల్ బ్రాంచి ఎస్ఐగా పని చేశారు. సిఐగా విజయవాడ ట్రాఫిక్‌లో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా చింతలపూడి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గతంలో ఇప్పటి వరకు పనిచేసిన మల్లేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ సుధాకర్‌ను చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు, ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావులు మర్యాద పూర్వకంగా కలిశారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా అని మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య తెలిపారు. శనివారం నూజివీడు నియోజకవర్గ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా నూజివీడులో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎంఎల్ఎగా నూజివీడుని అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. ప్రస్తుతం ఇక్కడ అభివృద్ధి కుంటిపడిందని, వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తానని, పరిశ్రమలు స్థాపిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఊరడింపు పలుకులు..!

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాల జాతర

ఓవైపు గణతంత్ర వేడుకలు.. మరోవైపు మాకిచ్చిన హామీల సంగతేమిటంటూ రైతులు, కార్మికులు రోడ్డెక్కి నినాదాలు వెరసి జిల్లాలో నెలకొన్న పలు సమస్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. అయితే ఎన్నికల వేళ ఊరడింపు మాటలు.. శంకుస్థాపనల హడావుడి పెరగడంతో మాటలేనా.. చేతలేమైనా ఉంటాయా అని జనం చర్చించుకుంటున్నారు.

గణతంత్ర వేడుకల్లో గవర్నర్ తన ప్రసంగంలో పోలవరం ప్రాజెక్టుతోపాటే పునరావాసం అని ప్రకటించడం నిర్వాసితుల్లో చర్చనీయాంశమైంది. పరిహారం దక్కక, పునరావాస కాలనీల్లో వసతుల్లేక నిర్వాసితులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓపక్క పరిహారం ఇవ్వకుండానే ప్రాజెక్టు పనులు చేపట్టడం, గేట్లు అమర్చడంతో బ్యాక్ వాటర్ ఎగదన్ని గోదావరికి స్వల్ప వరదొచ్చి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గ్రామాలు నీట మునుగుతున్నాయి. జూన్ నుంచి సెప్టెంబర్ నెల వరకూ నాలుగు నెలలపాటు అక్కడి ప్రజలు ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. పరిహారం ఇస్తే తాము పునరావాస కాలనీలకు వెళ్లిపోతామని నిర్వాసితుల నోటిమాటగా మారిందంటే వరదలకు వాళ్లెంత భయభ్రాంతులకు గురవుతున్నారో అర్థమవుతోంది. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం ప్రక్రియ పూర్తి చేశాకే ప్రాజెక్టు పనులు చేపట్టాలని సిపిఎం, ఎపి గిరిజన సంఘం, నిర్వాసితుల సంఘం చాలాకాలంగా డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో ఆందోళనలు సైతం నిర్వహిస్తున్నాయి. సిఎం నిర్వాసిత గ్రామానికి వస్తే ఆ గ్రామ, చుట్టుపక్కల గ్రామాల్లోని కొందరు నిర్వాసితులకే పరిహారం జమవుతుండటం సర్వసాధారణంగా మారింది. దీంతో మిగిలిన గ్రామాల నిర్వాసితులు తీవ్ర నిరాశ, ఆవేదనకు గురవుతున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం, ప్రస్తుతం జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టులపై సారించిన దృష్టి నిర్వాసితులపై కేంద్రీకరించిన దాఖలాల్లేవు. కనీసం ఇప్పటికైనా గవర్నర్ ప్రాజెక్టుతోపాటే పునరావాసం అని చెప్పడం కొంత ఊరడింపేనని నిర్వాసితులు చెబుతున్నారు. అయితే పునరావాసం పూర్తయ్యాకే ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పునరావాస కాలనీల్లో వసతుల కల్పనపైనా దృష్టి సారించాలని కోరుతున్నారు. అయితే ఇది ఎన్నికల ముందు ఊరడింపు ప్రకటనగా మిగులుతుందో.. లేదో వాస్తవమో కార్యాచరణే తేల్చాల్సి ఉంది.

ఢిల్లీ రైతు ఉద్యమ సందర్భంగా ఇచ్చిన హామీల సంగతేమిటంటూ సంయుక్త కిసాన్ మోర్చా-కార్మికసంఘాల ఆధ్వర్యాన రైతులు, కార్మికులు జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ర్యాలీలు చర్చనీయాంశమయ్యాయి. ఓవైపు నిత్యావసరాల ధరలు



ఆకాశాన్నంటుతున్న తరుణంలో అందరికీ అన్నంపెట్టే అన్నదాత తాను పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రోడ్డెక్కాల్సి రావడం విచిత్రకరమైన పరిస్థితి అని అంతా వ్యాఖ్యానించడం గమనార్హం. రైతే లేకపోతే నోట్లోకి ముద్ద ఎలా వెళ్తోందని, వ్యవసాయంపై ఆధారపడే వివిధ తరగతుల ప్రజల జీవనమే ప్రశ్నార్థకమవుతోందని గుర్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల వేళ రానున్న కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ ప్రకటిస్తుందో.. లేదో వేచిచూడాలి.

ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడులో పేదలు, దళితులు తమ అసైన్డ్ భూములు తమకు ఇప్పించాలని ఏళ్ల తరబడి సాగిస్తున్న పోరును మళ్లీ ఉధృతం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండగా పోలీసు యంత్రాంగం చట్టం పేదలకు ఒకలా, భూముల ఆక్రమణదారులకు మరోలా అమలు చేస్తూ అపహాస్యం పాలవుతున్నారు. భూముల్లోకి వెళ్లొద్దని పేదలను అడ్డుకుంటున్న పోలీసులు మరి ఆక్రమణదారులు చెరువులో చేపలు పట్టుకుని వెళ్లిపోతున్నా కనీసం ప్రశ్నించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రరూపం దాల్చుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పిసిసి అధ్యక్షురాలి హోదాలో షర్మిల ఏలూరులో పర్యటించారు. నేతల హాజరు బాగున్నా కార్యకర్తల సమీకరణలో వెనుకబాటు ఈ సమావేశంలో స్పష్టంగా కన్పించింది. ప్రధానంగా రెండు జిల్లాలను నడిపించే నేతలకు బాధ్యతలు అప్పగించకపోవడం, ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఇవ్వకపోవడంతో నేతలే హాజరయ్యారు తప్ప కార్యకర్తలు ఈ సమావేశానికి దూరంగా ఉన్నారనేది స్పష్టమవుతోంది. ఏదేమైనా షర్మిల తనదైన శైలిలో బిజెపి, వైసిపి, టిడిపిలపై విమర్శలు ఎక్కుపెట్టడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో అధికారపక్షం, ప్రతిపక్షం తేడా లేకుండా అంతా బిజెపి ముందు సాగిలపడుతున్నారని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు ప్రమాదకరమని సిపిఎం ఎప్పటి నుంచో హెచ్చరిస్తోంది. తాము అధికారంలోకొస్తే ప్రత్యేక హోదా కాంగ్రెస్ ఇస్తుందని ప్రకటించడమూ చర్చనీయాంశమైంది. అయితే ఈ అంశాలన్నీ రానున్న ఎన్నికల్లో ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

ఇక జిల్లాలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనల జాతర ప్రారంభమైంది. ఎంఎల్ఎలు శంకుస్థాపనలతోపాటు అభివృద్ధి పనులను హడావుడిగా పూర్తి చేయించి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. పనిలో పనిగా ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమంటూ ఎన్నికల ప్రచార శంఖారావం పూరించేస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

బస్సులోంచి పొగలు.. ప్రయాణికుల కంగారు
తప్పిన ప్రమాదం

చింతలపూడి : చింతలపూడి మండలం ఆందోనినగరం వద్ద ఏలూరు డిపోకు చెందిన బస్సు ఒకసారిగా ఇంజన్‌లోంచి పొగలు రావడంతో ప్రయాణికులు కంగారుపడి బస్సులో నుంచి కిందకి దిగిపోయారు. దీంతో డ్రైవర్ మార్గ మధ్యలోనే బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. సుమారుగా 35 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నట్లుగా సమాచారం. కారణాలు తెలియాల్సి ఉంది.

జోరుగా మద్యం విక్రయాలు

ముదినేపల్లి : గణతంత్ర దినోత్సవం నాడు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేసినప్పటికీ మద్యం విక్రయాలు మాత్రం ఆగలేదు. ముందు రోజే ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బెల్ట్ షాపుల నిర్వాహకులు పెద్ద ఎత్తున మద్యాన్ని కొనుగోలు చేసి మద్యం ప్రియులకు శుక్రవారం అమ్మకాలు చేశారు. ఒక్కో మద్యం సీసాపై రూ.50 నుంచి రూ.100 చొప్పున అదనంగా వసూలు చేసినట్లు మద్యం ప్రియులు చెబుతున్నారు. మండలంలో బెల్ట్ షాపులు గ్రామ గ్రామానా పుట్టగొడుగుల్లా వెలిశాయి. వీటిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ పోలీసులు మామూళ్ల మత్తులో మునిగితేలుతూ బెల్ట్‌షాపు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని ఎపిఎస్‌ఆర్‌టిసి డిపోలో శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ నాగ మురళీ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాథమిక చికిత్స పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్ కుమార్, సామాజిక వేత్త కృష్ణప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఆందోళన

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద తమకు న్యాయం చేయాలంటూ 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాకారులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ ముందుగా నూజివీడులో క్రికెట్ నిర్వహిస్తామని చెప్పి అనంతరం దిగవల్లి గ్రామంలో మ్యాచ్ కొనసాగించినట్లు తెలిపారు. ఎంపైర్ తప్పుడు నిర్ణయంతో తమకు ఎంతో నష్టం వాటిల్లిందని క్రీడాకారులు వాపోయారు. ఎంపైర్లను మార్చి మళ్లీ టోర్నమెంట్ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

నూజివీడు రూరల్ : పట్టణంలోని సైంట్ ఆన్స్ హైస్కూల్ ఆవరణలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐడి సిఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన ద్వారా సామాజిక భద్రత ఏర్పడుతుందన్నారు. దళితుల అభ్యున్నతికి చట్టాలు దోహద పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడ్డ వారిని రక్షిస్తే రూ.5 వేలు

నూజివీడు రూరల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని మానవతా దృక్పథంతో రక్షించిన వారికి రూ.5 వేల నగదు బహుమతిగా ఇవ్వటం జరుగుతుందని ప్రాంతీయ రవాణా అధికారి నాగ మురళీ తెలిపారు. పట్టణంలోని ప్రాంతీయ రవాణా కార్యాలయంలో 35వ జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగ మురళీ మాట్లాడుతూ బైక్ నడిపేవారు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సాయం అభినందనీయం

కలిదిండి : నిరుపేదలకు సాయం అందించడం అభినందనీయమని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచి మనిమొక్కు మారుతీ ప్రసన్న, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, మానవత సేవా సంస్థ చైర్మన్ పేటేటి వివేకానంద, అధ్యక్షులు గొంది సత్యనారాయణ పాల్గొన్నారు.

అధికారులకు వీడ్కోలు

చింతలపూడి : మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో సాధారణ బదిలీల్లో భాగంగా అధికారులు వేరే మండలానికి బదిలీ అవుతుండగా మండల అధికారులందరితో కలిసి వీడ్కోలు సభను చింతలపూడి తహశీల్దార్ కృష్ణజ్యోతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మండలంపై తమకున్న అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు, ఎఎ మీనాకుమారి పాల్గొన్నారు.

ముదినేపల్లిలో మాదిగల మేలుకొలుపు

ముదినేపల్లి : మాదిగల భవిష్యత్తు కోసం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య కోరారు. ముదినేపల్లిలో మాదిగల మేలుకొలుపు సభ శనివారం నిర్వహించారు. ఈ సభకు మోక పోగ దానియేలు అధ్యక్షత వహించారు. ఈ సభలో అర్హులైన పేద మహిళలకు మూడు ఎకరాల భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

నేరాలు – ఘోరాలు

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

టి.నరసాపురం : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము శ్యాంబాబు ఈనెల 24న బంధువులు అనారోగ్యంతో ఏలూరు ఆసుపత్రిలో ఉండగా వారిని చూడడానికి వెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న అతని భార్య ఎప్పటిలాగే రాత్రి 10 గంటలకు భోజనం చేసి పడుకుంది, ఉదయం చూసేసరికి కన్పించలేదని ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రేతపై కేసు

టి.నరసాపురం : నాటుసార విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బందంచర్ల గ్రామానికి చెందిన వ్యక్తి ప్రభుత్వం నిషేధించిన నాటుసార విక్రయిస్తున్నాడనే సమాచారంతో తన సిబ్బందితో దాడి చేయగా అతని వద్ద దొరికిన 9 లీటర్ల నాటుసార స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
జంగారెడ్డిగూడెం, నూజివీడు, ఏలూరు, పెదవేగి, పెదపాడు, దెందులూరు, కామవరపుకోట, లింగపాలెం, కె.ఆర్.పురం (బుట్టాయగూడెం), వేలేరుపాడు, నిడమర్రు, కైకలూరు, తాడేపల్లిగూడెం టౌన్, భీమవరం టౌన్, పెంటపాడు, అత్తిలి, ఇరగవరం, పెనుమంట్ర
యాడ్ ఎగ్జిక్యూటివ్: నూజివీడు. మార్కెటింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
ఇంటర్వ్యూ : తేది: 30-01-24 మంగళవారం ఉదయం 10 గం|| నుండి 12 గం|| వరకు
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం:
ప్రజాశక్తి కార్యాలయం, పవర్‌పేట, ఏలూరు
ఫోన్ నెం : 99493 66196, 89191 70815, 94900 99168

సేవ.. అభివృద్ధే నా లక్ష్యం

సొంతూరుపై మమకారంతో అమెరికాను వీడా
మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవలు
ఒక్క అవకాశమిస్తే 'చింతలపూడి'ని అభివృద్ధి చేస్తా
టిడిపి యువ నేత సొంగా రోషన్ కుమార్

చిట్ చాట్

ప్రజాశక్తి – చింతలపూడి

కుల, మతాల పట్టింపు లేకుండా మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థ ద్వారా చింతలపూడి నియోజకవర్గ పరిధిలో అనేక మందికి సాయం అందించడంతోపాటు విద్య, వైద్యం చేరువ చేసి, యువతకు ఉపాధి కల్పన, మహిళలను ఆర్థికంగా బలపర్చేలా కుటీర పరిశ్రమలు తీసుకురావడమే తన లక్ష్యమని టిడిపి యువ నేత, మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సొంగా రోషన్‌కుమార్ చెప్పారు. మన ఊరు–మన వ్యాపారం ద్వారా యువత ఆర్థికంగా బలపడేటట్లు సేవలందిస్తున్నానని వివరించారు. తనకు ఎంఎల్‌ఎగా అవకాశమిస్తే చింతలపూడి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఆయన ప్రజాశక్తి నిర్వహించిన చిట్‌చాట్‌లో పలు అంశాలపై మాట్లాడారు.

ప్రశ్న: మీ సొంతూరు ఎక్కడ ?

నాది చింతలపూడి నియోజకవర్గంలోని లింగపాలెం మండలం ధర్మాజీగూడెం సొంతూరు. నాన్న సొంగా రాజారత్నం, అమ్మ డాక్టర్ వెలిమర్తి రాజ్యలక్ష్మి. నా తల్లి చింతలపూడిలోని సుబ్రిపేట. మా కుటుంబంలో అంతా ఉద్యోగస్తులే.

ప్రశ్న: రాజకీయాల్లోకి రావడానికి కారణం?

చిన్న వయస్సులోనే అమెరికా వెళ్లాను. అక్కడ అభివృద్ధి బాగుంది. నేను చింతలపూడి వచ్చినప్పుడు గతంలో ఊరు ఎలా ఉందో ఇప్పుడు అలాగే ఉంది. ఎటువంటి అభివృద్ధి కన్పించలేదు. రోడ్లు, పరిశ్రమలు లేవు. యువత పోటీ పరీక్షల్లో శిక్షణ కోసం వేరే చోటికి వెళ్లాల్సిన పరిస్థితి. ఈ వెనుకబాటును చూసి రాజకీయాల్లోకి రావాలనుకున్నాను. సరైన విద్య, వైద్య సదుపాయాలు లేవు. పంటలకు గిట్టుబాటు ధర లేదు. ఉదాహరణకు మల్లేశ్వరం గ్రామంలో 600 ఎకరాల భూమి ఉంది. అయితే సాగునీరు లేక పంట పండించలేని దుస్థితి నెలకొంది. పంట పడకల అన్నది పూర్తి కాని పరిస్థితి. ప్రతి పేద కుటుంబానికి విద్య, వైద్యం వంటి కనీస అవసరాలు అందడం లేదు. అందుకే మార్పు కోసం నా సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి అమెరికా వదిలి స్వగ్రామం వచ్చాను.

ప్రశ్న: చింతలపూడి నియోజకవర్గాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నారు?

చింతలపూడి నియోజకవర్గాన్ని వైద్యం, విద్య, ఉపాధి కల్పనలో మొదటి స్థానంలో ఉంచాలనేది నా లక్ష్యం. యువత పోటీ పరీక్షలకు కోచింగ్ కోసం ఎక్కడో ఉన్న అవనిగడ్డ, రాజమండ్రి వంటి ప్రాంతాలకు వెళ్లేకంటే చింతలపూడిలోనే ఉత్తమ ఫ్యాకల్టీతో కోచింగ్ ఇప్పించి ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహిస్తాను. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తా. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి జ్ఞానాన్ని పెంచుకునేలా చేస్తా. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలి. అల్లిపల్లి వంటి క్షేత్రాలను ప్రసిద్ధ క్షేత్రాలుగా మార్చి అభివృద్ధి చేయాలి. స్వయం ఉపాధి కల్పించాలి. సంపదను సృష్టించాలి. వ్యాపారాలు అభివృద్ధి చెందాలంటే రోడ్ల సదుపాయం, బస్సు సౌకర్యం ఉండాలి. వాటిపై ప్రత్యేక దృష్టి పెడతాను. చింతలపూడికి బస్సు డిపో కచ్చితంగా తీసుకొస్తాను. వ్యాపార సంస్థలను ఆహ్వానిస్తాను. వ్యాపార సంస్థలు వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

చంద్రబాబుతో రోషన్‌కుమార్

ప్రశ్న: యువతకు మీరు ఏం చెబుతారు?

యువత ఆలోచించాలి. ఇప్పటి వరకు అభివృద్ధి జరిగిందా, లేదా అనేది తెలుసుకోవాలి. నాకు ఎటువంటి పదవులూ, అధికారం లేకుండానే మిషన్ హోప్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశాను. మంచికి అండగా ఉండండి. నిజాయతీపరులకు మద్దతివ్వండి. ఒక లక్ష్యంతో ముందుకు వచ్చాను. నేను ఒకటి అనుకుంటే అది జరిగే వరకు వదిలిపెట్టను. ఏదైనా అభివృద్ధే నా లక్ష్యం. డబ్బు మీద ఆశ లేదు, సంపాదించాలనే కోరిక లేదు. రాజకీయాల్లో కంటే నేను అమెరికాలోనే ఎక్కువ సంపాదిస్తాను. నియోజకవర్గ అభివృద్ధి యువత చేతుల్లోనే ఉంది. మీలో మార్పు నియోజకవర్గ అభివృద్ధికి నాంది కావాలి.

ప్రశ్న: మన ఊరు-మన వ్యాపారం లక్ష్యం ఏమిటి?

మన ఊరు–మన వ్యాపారం ద్వారా యువత తన సొంత కాళ్లపై నిలబడేలా చిరు దుకాణాలు పెట్టుకోవడానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆర్థిక సాయం చేస్తున్నాను. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావు. అలాంటి నిరుద్యోగ యువత ఆర్థికంగా బలపడేలా చేస్తున్నాను. అదేవిధంగా ఆటో యూనియన్ వారికి 50 నుంచి 60 మంది వరకూ యూనియన్ తరపున రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాను. వారు అనారోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్నప్పుడు ఇవి వాడుకొని, మళ్లీ అక్కౌంట్‌లో వేసే విధంగా.. వారి అవసరాలకు వినియోగించుకునేలా చేస్తు న్నాను.

ప్రశ్న: టిడిపి టిక్కెట్ లభిస్తే మీకే ఓటు ఎందుకు వేయాలి?

మాది రాజకీయ కుటుంబం కాదు. నా సంపాదన, నా భార్య సంపాదనలో 10 శాతం పేదలకు ఇవ్వాలనే సంకల్పంతో మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. దాని ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశాం. నియోజకవర్గంలో కుల, మత భేదాలు లేకుండా, అవసరమున్న వారికి ఆర్థికంగా సాయం చేశాను. కేన్సర్‌తో బాధపడుతున్న వారికి ఉచిత మెడికల్ క్యాంప్ మణిపాల్ హస్పిటల్ వారిచే పెట్టించి ఎనిమిది వేల మందికి సేవలందించాను. నియోజకవర్గంలో పలు మెడికల్ క్యాంప్‌లు పెట్టించాను. కరోనా సమయంలో మిషన్ హోప్ టీమ్ ద్వారా ప్రయివేట్ టీచర్లు, మహిళలకు ప్రతిగ్రామంలో నిత్యావసర సరుకులు అందజేశాం. ఎటువంటి పనీ చేయలేకపోతున్న 40 మందికి పెన్షన్ అందిస్తున్నాం. పూర్తిగా ఉపాధి లేని, పని చేయలేని 15 మందికి ఇప్పటికీ నెలకు రూ.5 వేలు పెన్షన్ అందజేస్తున్నాను. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న చిన్నారులకు నెలకు రూ.10 వేలు చొప్పున అందించాను. ఇంకా చెప్పుకుంటే చాలా ఉన్నాయి. ఇది అంతా సేవ చేయాలనే తపనతో చేశాను. అదే అధికారం ఉంటే అందరికీ సేవ చేసే అవకాశం లభిస్తుంది.

ప్రశ్న: నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే సందేశం?

మంచికి ఓటు వేయండి. నిజాయతీని గెలిపించండి. అభివృద్ధికి మీ ఓటుతో స్వాగతం పలకండి. పలావు, సారా, మద్యం, డబ్బుకి మీ ఓటును అమ్ముకుంటే, ఐదు సంవత్సరాల అభివృద్ధిని దూరం చేసుకున్నట్టే. మీ ఓటు మన భావితరాల భవిష్యత్తుకు పునాది అని గుర్తుపెట్టుకోండి.

ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలి
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఉపాధి హామీ చట్టంలో ఫేస్ యాప్‌ను రద్దు చేసి వేతన బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఎం.జీవరత్నం అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. గ్రామీణ పేదలకు, దళితులకు, కూలీలకు బువ్వపెట్టే పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తుందన్నారు. ఇప్పటికి గత పది వారాల నుంచి వేతనాలు కూలీలకు అందక నాన్న అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలు, పేదల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. బడ్జెట్‌లో నిధులు తగ్గించి, చెరువు పూడిక వంటి పనులను తగ్గించి ఉద్యానవన పంటలకు నిధులు కేటాయించడం వల్ల అసలైన పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఆక్వా చెరువులో తవ్వకాలకి ఉపాధి నిధులు మళ్లించడం దుర్మార్గమన్నారు. జిల్లాలో పనులు జరుగుతున్న నేపథ్యంలో కూలీలకు కనీస సౌకర్యాలు ప్రభుత్వాలే కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్, మంచినీరు, పనిముట్లు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇప్పటికే పెండింగ్ ఉన్న వేతన బకాయలు విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, తామ ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, జిల్లా సహాయకార్యదర్శులు ఎస్.మహంకాళి రావు, ఎం.సుధారాణి, టి.సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్, ఎస్.సాయికృష్ణ, ఎస్.కోటేశ్వరరావు, హెూలీ మేరీ, వై.సీత, లక్ష్మయ్య, పి.ఆనందరావు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి

మండవల్లి : క్రమశిక్షణ, వ్యక్తిత్వం, నడవడిక విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని ప్రొఫెసర్ విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక జెడ్‌పిహెచ్ పాఠశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయకుమార్ మాట్లాడుతూ పదవ తరగతి తర్వాత ఏ సబ్జెక్టు తీసుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటాము అనేది ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, మండల అధ్యక్షులు టి.అప్పారావు, హెచ్ఎం జి.ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు సాయం

ఏలూరు టౌన్ : ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అనే మదర్ థెరిస్సా ఆశయాలకు అనుగుణంగా దెందులూరు నియోజకవర్గానికి చెందిన కొందరు యువకులు సేవా, సహాయ కార్యక్రమాలు చేసేందుకు చేయూత అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ప్రతినెల పేద కుటుంబాలకి బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందిస్తూ ముందుకు దూసుకుపోతున్నారు. ఈనేపథ్యంలో ఇప్పటివరకు చేయూత సంస్థ ద్వారా 95 పేద కుటుంబాలకు సహాయ, సహకారాలు అందించారు. పెదవేగి మండలంలోని గుమ్మడి గుంట గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లుతో పాటు సర్వం కోల్పోయిన గుటకల నాని, అతని భార్య ఉషాలకు చేయూత టీం సభ్యులు మేక లక్ష్మీనారాయణ, కొత్తగూడెం ఎఎస్ఐ గంగుల ఆంజనేయులు, ఆర్‌కె బోర్వెల్స్ అధినేత, చేయూత టీం సభ్యులు ఏనుగు రామకృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ చేయూత టీం సభ్యులు తాతా సూరిబాబు, పరస నాగార్జున, ఇజ్జి గాని శరత్, మోర్ల హేమ సుందర్, లక్ష్మణరావు, ప్రసాద్, రాజేంద్ర, నాగేశ్వరరావు, చిన్ని, మహేష్, శ్రీనులతో కలిసి ఆ పేద కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

బొర్రంపాలెంలో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి – టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం గ్రామ పంచాయతీలో శనివారం దోమల నివారణకు మాజీ సర్పంచి పెండ్యాల మల్లిబాబు కుమారుని ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేయించారు. గ్రామాల్లో దోమల బెడద అధికంగా ఉండటం వల్ల ప్రజలు విషజ్వరాలపాలై బాధలు పడుతున్నారనే విషయాన్ని సోషల్ మీడియాలో చూసిన మాజీ సర్పంచి పెండ్యాల మల్లిబాబు కుమారుడు సామాజిక వేత్త పెండ్యాల అభిషేక్ బాబు తన సొంత ఖర్చులతో యుద్ధప్రాతిపదికన పంచాయతీ అంతటా దోమల మందు అభిషేక్ యూత్ ఆధ్వర్యంలో పిచికారీ చేయించారు. అభిషేక్ బాబును పలువురు అభినందించారు.

'టిడిపి గెలుపునకు సైనికుడిలా పనిచేయాలి'

పోలవరం : రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకోవడానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని టిడిపి పోలవరం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బ రాంబాబు అన్నారు. కుటుంబ సాధికారిక సారథులు, ఓటర్ వెరిఫికేషన్, టిడిపి యాప్, బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలు ఏవిధంగా చేపట్టాలి అనే విషయాలపై శనివారం పోలవరం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ బాబుకు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పోతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఖోఖో ఆటలో మండవల్లి టీమ్ విజయం

మండవల్లి: ఆడుదాం ఆంధ్రలో నియోజవర్గ స్థాయిలో నిర్వహించిన ఖోఖో ఆటలో మండవల్లి టీం విజయం సాధించింది. కైకలూరు మండలం ఆరు తెగలపాడులో బొమ్మనంపాడు, మండవల్లి టీంలకు శనివారం నిర్వహించిన ఖోఖో ఆటలో బొమ్మనంపాడుపై 2-14 స్కోరుతో మండవల్లి టీం గెలుపొందింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు బొమ్మన బోయిన గోకర్ల యాదవ్, సర్పంచి మండల్ జాన్సీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీసే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. అనంతరం ఖోఖోలో గెలుపొందిన టీంను కార్యదర్శి తోట శ్రీనివాసరావు, విఆర్ఒ కమలహాసన్, మెండ సురేష్, సచివాలయం సిబ్బంది అభినందించారు.

అంగన్వాడీల సమ్మె ఉద్యోగ సంఘాలకు ఆదర్శం : సిఐటియు

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తలు చేసిన 42 రోజుల సమ్మె రాష్ట్ర చరిత్రలో ఉపాధ్యాయ సంఘాలకు ఆదర్శంగా నిలిచిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్ నారాయణ కొనియాడారు. చింతలపూడి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు చేసిన 42 రోజుల సమ్మె సాధించిన విజయాలకు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు శనివారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ చింతలపూడి ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు బి.ఫణివర్ధిని ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ సభ కార్యక్రమానికి సెక్టార్ నాయకులు ఎం.సత్యవతి, బాబి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌విఎస్ నారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల ఐక్యతే విజయాలకు చిహ్నాలుగా నిలుస్తాయన్నారు. ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు పి.సరోజిని, టి.మాణిక్యం, మిని సెంటర్ల జిల్లా నాయకురాలు జి.సరళ పాల్గొన్నారు.

రైతు భరోసా శిక్షణ, సందర్శన

ఏలూరు టౌన్: రైతు భరోసా శిక్షణ, సందర్శన కార్యక్రమాన్ని డాక్టర్ కె.మోహనరావు, ప్రిన్సిపల్ సైంటిస్టు(వెంటమాలజీ) అధిపతి వ్యవసాయ పరిశోధనా స్థానం విజయరాయి వారి అధ్యక్షతన ఏలూరు వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆరు సబ్ డివిజన్లకు చెందిన సహాయ వ్యవసాయ సంచాలకులు పంటల స్థితిగతులను, చీడ పీడల పరిస్థితులను, వివిధ పంటల విస్తీర్ణముల గురించి తెలియజేశారు. డాక్టర్ కె.మోహన్ రావు జిల్లాలో సాగు చేస్తున్న వివిధ పంటల గురించి తెలియజేశారు. డాక్టర్ టి.సుజాత, కోఆర్డినేటరు, ఏరువాక కేంద్రం వారు మామిడిలో పూత కావడానికి అత్రిల్ పిచికారీ చేయాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.చాముండేశ్వరి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.నాగేంద్ర పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో మందుల పంపిణీ

ప్రజాశక్తి – జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం సచివాలయ మైదానంలో శనివారం పివిఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి, మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచి సున్నం ఉషారాణి, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. వైద్య శిబిరానికి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి సుమారు 200 మంది వరకు హాజరు కాగా వారికి పలు రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందని రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు బిపి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పివిఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి.సురేష్, ఉప సర్పంచి కేతిరెడ్డి రాఘవ రెడ్డి, ఎంపిటిసి సున్నం సురేష్ పాల్గొన్నారు.

ఓట్లు దండుకునే శ్రద్ధ.. సమస్యల పరిష్కారంలో లేదు
ఆళ్లనానిపై ధ్వజమెత్తిన జనసేన ఏలూరు ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు అర్బన్ : ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న ప్రస్తుత ఎంఎల్‌ఎ ఆళ్ల నాని ప్రజలు పడుతున్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తి నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు విమర్శించారు. స్థానిక 31వ డివిజన్ అశోక్ నగర్‌లో ఆయన శనివారం పర్యటించి, అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన కరపత్రాలను వారికి అందించి జనసేన, టిడిపిల ఉమ్మడి ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకతను వాళ్లకు వివరించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు పడుతున్న కష్టాలను తీర్చాల్సింది పోయి ఏదో హడావిడిగా ప్రతి డివిజన్ కెళ్లి శంకుస్థాపన చేసి, పబ్బం గడుపుకోవడం సరికాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా తుపాకులు కలిగి ఉంటే కఠిన చర్యలు

ముదినేపల్లి : ఎవరైనా ఎటువంటి లైసెన్సులు లేకుండా నాటు తుపాకులు, మందుగుండు సామాగ్రి కలిగి ఉంటే అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్ తెలిపారు. లైసెన్స్ లేకుండా నాటు తుపాకులు కలిగి ఉన్న వారిని, చెరువుల మీద పిట్టలు కొట్టడానికి ఉపయోగించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని సిఐ అన్నారు. శనివారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించారు. చెరువులపైన నాటు తుపాకులతో పిట్టలను కొడుతున్నట్లయితే అట్టి సమాచారం వెంటనే 08674233333, 9440796428, 8332983800 నెంబర్లకు తెలియజేయాలన్నారు.

మార్కులిస్ట్ పోయినది

ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, అడవికొలను, డోర్‌నెం.4-4 కి చెందిన **మాదాసు వెంకటేశ్వరరావు, S/o.పోతురాజు** అను నా యొక్క ఒరిజినల్ 10వ తరగతి మార్కులిస్ట్ పడిపోయినది. ది.22-1-2024 తేదీన అడవికొలను నుండి గణపవరం జిరాక్స్ తీయించుటకు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో పడి పోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు.

మాదాసు వెంకటేశ్వరరావు, S/o.మాదాసు పోతురాజు
శ్రీ సుబ్బారాయుడు టెంపుల్, అడవికోలను,
నిడమర్రు మండలం, ఏలూరు జిల్లా.
సెల్: 9963666956

పాస్ పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం ఆచంట వేమవరం లింగరాజు చెరువు గట్టు డోర్ నెంబర్ 9-3, కి చెందిన **కోళ్ళ శ్రీనివాసరావు, తండ్రి వెంకటనారాయణ** కు చెందిన నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్ట్ పోయినది. పాస్ పోర్ట్ నెంబర్. **F 6497287** నెంబర్ గల ఒరిజినల్ పాస్ పోర్టును **24-01-2024** తేదీన ఆచంట వేమవరం నుంచి జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్ పై వెళ్తుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్ పోర్టు పోయినది. కావున ఎవరికైనా దొరికితే ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కోళ్ళ శ్రీనివాసరావు, తండ్రి వెంకటనారాయణ,
డోర్ నెంబర్ : 9-33, లింగరాజు చెరువు గట్టు, ఆచంట
వేమవరం, ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
పిన్ నెంబర్ 534272. సెల్ నెంబర్ 9949134241.

ప్రకటన

In the Court of the II Addl. Junior Civil Judge of Nuzvid
O.S.No.372/2020

Between:
Gogineni Narsa Kumai ..Plaintiffs
Versus
Potluri Nagarjuna Rao and 6 Others ...Defendants

పై నంబరు దావాలో పొట్లూరి శ్రీ హర్ష S/o.నాగార్జునరావు, డో.నెం.83-1-77, జంగంగూడెం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా మరియు పొట్లూరి పవన శ్రీనివాస్, S/o.మధుబాబు, డో.నెం.83-1-77, జంగంగూడెం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా వారికి శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన జరుగుతున్నందున శ్రీకోర్టు వారి అర్డరు ప్రకారము ఈ పేపరు ప్రకటన ద్వారా వారికి **05-2-2024**వ తేదీన వాయిదా అయివున్నది. అని తెలయచేయుచున్నాము. పై తెలిపిన కోర్టు వారి యందు మీరు **05-2-2024**వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరు కాని పక్షములో శ్రీకోర్టు వారు తీసుకొనే చర్యలకు బాధ్యులు అగుదురు అని యిందుమూలంగా తెలియ చేయుచున్నాము.

నూజివీడు — కె.వి.రాఘవరావు
ది.27-1-2024 — అడ్వకేట్, విజయవాడ.

గ్రామపంచాయతి కార్యాలయము - వీరవాసరం

ROC.No.01/2024. — **తేది.27-01-2024**

టెండర్ నోటీసు

పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం మండలం, వీరవాసరం గ్రామపంచాయతీ కార్యాలయం పరిధిలో 2024-2025 ఆర్థిక సంవత్సరము నకు సంబంధించి ఒక సంవత్సరం కాలం పాటు అనగా **ది.01-04-2024వ తేది నుండి 31-03-2025వ** తేది వరకు ఈ క్రింద తెల్పిన ప్రజారోగ్య, మంచినీటి సరఫరా, వీధి లైట్లు నిర్వహణ, పనులు నిర్వహించుటకు గాను బహిరంగ టెండర్లు, **ది.03-02-2024** తేదిన గ్రామపంచాయతి కార్యాలయంలో **ఉదయం 11.00 గం.ల నుండి మధ్యాహ్నం 2.00 గం.ల వరకు** స్వీకరించబడి అదే రోజు **మధ్యాహ్నం 3.00 గం.లకు** హాజరు కాబడిన టెండర్‌దారుల సమక్షములో నాచే గాని లేదా నా అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరువబడును. టెండర్లు దాఖలా చేయు వారు ముందు గా నిర్ణిత ధరావత్తు **రూ.250/-** చెల్లించవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు పరిగణన లోకి తీసుకొనబడవు. ఇతర విషయములు గ్రామపంచాయతీ కార్యాలయం పనిచేయు సమయము నందు తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	పని వివరం	వ్యక్తుల సంఖ్య	కాలము	ధరావత్తు ఒక్కొక్కరికి
1.	2024-2025 సం.నకు (01-04-2024 to 31-03-2025) వరకు పారిశుధ్య పనులు నిర్వహించుటకు.	16	ది.01-04-2024వ తేది నుండి 31-03-2025వ తేది వరకు	రూ.250/-
2.	2024-2025 సం.నకు (01-04-2024 to 31-03-2025) వరకు మంచినీటి సరఫరా పనికి	5	ది.01-04-2024వ తేది 31-03-2025వ తేది వరకు	రూ.250/-
3.	2024-2025 సం.నకు (01-04-2024 to 31-03-2025) వరకు వీధి దీపముల నిర్వహణ	1	ది.01-04-2024వ తేది 31-03-2025వ తేది వరకు	రూ.250/-
4.	2024-2025 సం.నకు (01-04-2024 to 31-03-2025) క్లీన్ ఆంధ్రప్రదేశ్ వెహికల్ డ్రైవర్‌గా పనిచేయుటకు	1	ది.01-04-2024వ తేది 31-03-2025వ తేది వరకు	రూ.250/-

సం/- పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ
వీరవాసరం, వీరవాసరం మండలం, ప.గో.జిల్లా.